# లోపాముద్ర

బ్రహ్మచర్య దీక్షాపరతంత్రుడై, తపోనిష్ఠాగరిష్ఠుడైన మహర్షి అగస్త్యుడు-ఒకనాడు అరణ్య ప్రాంతంలో తిరుగాడుతున్నాడు. కొంత దూరం రాగానే అడుగు ముందుకు పడక ఆగిపోయాడు. ఆ దృశ్యం అతని మనసుని కలచి వేసింది ఎదురుగా ఉన్న వృక్షానికి తలకిందులుగా వేలాడుతున్నారు తపోధనులు లోక శ్రేయస్సు కోసం. ఈ మహర్షులు చేస్తున్న తపస్సేమిటో అర్థం కాలేదు ఎంత ఆలోచించినా. సంభ్రమంతో వారిని సమీపించాడు అగస్త్యుడు.

"దేనికోసం తమరీ ఘోర తపసు తలపెట్టేరో?" వినయంగా ప్రశ్నించాడు.

వారు సమాధానం చెప్పలేదు. వారి ముఖంలో దైన్యం కనిపించింది అగస్త్యునికి. మరొక్కసారి వారికేసి చూస్తూ ప్రశ్నించాడు.

"అయ్యా, మా వంశస్థుడైన అగస్త్యుడు బ్రహ్మచర్య దీక్షాపరుడై ఉన్నాడు. అతను వివాహం చేసుకుని, సంతానవంతుడైతే కదా మాకు ఊర్ధ్వ గతులు దక్కేవి! అంతవరకు మా స్థితి ఇంతే!" అన్నారు నిరాశతో.

అతని ముఖం వివర్ణమైంది. వారికి సద్గతులు కల్గించలేని తన తపోదీక్ష, బ్రహ్మచర్యం కొరగానివే. అగస్త్యుడు వివాహం చేసుకుందుకు ఆ క్షణమే నిశ్చయించుకున్నాడు.

కన్యాన్వేషణకి బయలుదేరిన అగస్త్యునికి ఆశాభంగమైంది. పితృదేవతల దీనస్థితి చూసి మనసు కరిగిందే కానీ, వివాహానికి తనకు తగిన కన్య లభించటం సాధ్యం కాదని తెలిసి అగస్త్యుడు పరితాపం చెందాడు.

తను చేసిన వాగ్దానం ఎలా నిలుపుకోవాలా అని చింతిస్తున్న అగస్త్యుని మనోమందిరంలో మెరుపులాటి భావన మెరిసింది.

తపశ్శక్తిని ఉపయోగించి ఒక కన్యకు జన్మనిస్తే? కానీ ఆ కన్య ఎక్కడ జన్మించాలి? ఎవరికి జన్మించాలి? తన తపశ్శక్తి ప్రభావంతో జన్మించే కన్యకి జననీ జనకులు కాదగిన దంపతు లెవరు? అల్లకల్లోలమైన తన మనసుని అదుపులో పెట్టాడు అతి కష్టంతో.

ధ్యానముద్రాంకితు డయ్యాడు అగస్త్యుడు. ధర్మపరుడు, నీతివిదుడు అయిన విదర్భరాజు అతనికి స్ఫురించాడు.

అగస్త్యుడు మహదానందంతో విదర్భ రాజాస్థానం చేరాడు. ఎదురెళ్ళి ఆహ్వానించి అతిథి సత్కారాలు చేశాడు విదర్భరాజు.

"నా తపశ్శక్తి ప్రభావంతో నీకు పుత్రిక జన్మిస్తుంది." అగస్త్యుని ఆశీస్సు విదర్భరాజుకి గొప్ప ఆశని కలిగించింది. సంతానార్థియై పరితపిస్తున్న విదర్భరాజుకి అగస్త్యుని రాక గొప్ప శుభసూచకంగా భాసించింది.

లోపాముద్ర దినదిన ప్రవర్ధమానురాలైంది. సౌందర్యం రాశి పోసినట్లు, సౌకుమార్యం అంగాంగాలలో ప్రోది పోసినట్లు యౌవనశోభతో ముగ్ధమనోహరంగా రూపుదిద్దుకుంది. ఆమె విలాస సంపదకి ఆకర్షితులు కానివారు లేరు. కానీ, ఆమె జన్మవృత్తాంతం విన్న ఎందరో అగస్త్య భయంతో ఆమెను వరించడానికి వెనుకాడారు. విదర్భరాజుకి లోపాముద్రకి తగిన వరుణ్ణి ఎలా తేగలననే చింత ఎక్కువైంది.

వసంతాగమనంతో ఉద్యానవనమంతా విరబూసింది. పుష్పాపచయానికి స్నేహితురాళ్ళతో పుష్పవనాన్ని చేరింది లోపాముద్ర. ఎక్కువసేపు అక్కడే గడిపి ఇల్లు చేరిన లోపాముద్ర, తండ్రితో సంభాషిస్తున్న మునీశ్వరుని చూసి అడుగు ముందుకు పడక అక్కడే నిలబడిపోయింది.

ఆ మహర్షి చూపుల్లో ఏదో ప్రత్యేకత కనిపించిందామెకి. అతని కొనదేరిన నాసికలో గొప్ప పట్టుదల, కార్యదీక్ష కనిపించాయి. అతని విశాల ఫాలభాగం చెప్పరాని విజ్ఞతకి నిలయమన్నట్టనిపించింది. రెప్పపాటు లేకుండా మహర్షిని తిలకిస్తూంది లోపాముద్ర.

అగస్త్యుడు ఆమె వంక పరిశీలనగా చూశాడు. ఆమె వేగంగా లోపలికెళ్ళిపోయింది.

విదర్భరాజుకి లోపాముద్ర, అగస్త్యులు ఒకరి నొకరు పరిచయస్థుల్లా చూసుకోవటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

అగస్త్య మహర్షి విదర్భరాజు వంక చూస్తూ, "లోపాముద్రను నా కిచ్చి వివాహం చేయి" అన్నాడు.

విదర్భరాజు విస్తుపోయాడు.

మహర్షి చిరునవ్వు నవ్వి, "రాజా! ఆనాడు సంతానార్థం వేదన చెందుతున్న నీకు నా తపఃప్రభావమే నీ ఇంటి కుమార్తెగా జన్మిస్తుందని చెప్పలేదా? లోకంలో ఏ కన్యా నాకు ధర్మపత్ని కాదగినది లేకనే ఆనాడు ఆ పని చేశాను. ఈమెను నా కిచ్చి వివాహం చేయి" అన్నాడు ప్రశాంతంగా.

విదర్భరాజుకి ఈ మాట అశనిపాతమైంది. ఆనాడు తనని ఆశీర్వదించాడనుకున్న మహర్షి, ఈనాడు తన్నిలా పరీక్షిస్తున్నాడేమిటి? అల్లారుముద్దుగా

పెరిగిన పిల్ల రాజపత్ని అయి అష్టైశ్వర్యాలతో తులతూగుతుందని ఆశించాడు కానీ, నార వస్త్రాలు ధరించి, కందమూలాలు తింటూ అరణ్యంలో సంచరించే మునీశ్వరునకు తన కుమార్తె నిచ్చి వివాహం చేయటమా?

రాకుమార్తె లోపాముద్ర ఎక్కడ, మహా తపస్వి అగస్త్యు డెక్కడ? ఇలా పొత్తు కుదరట మెలా? విదర్భరాజు మనసు తీవ్ర సంఘర్షణతో కొట్టుమిట్టా డింది. ఇంత గారాబంగా పెరిగిన పిల్లని ఇప్పుడు మునీశ్వరుని కిచ్చి, ఆమె జీవితం అడవిపాలు చేయటానికి మనసు అంగీకరించలేదు. ఈ విపత్కర స్థితిని ఎదుర్కొట మెలాగని రాజదంపతులు విచారమగ్నులయ్యారు.

అగస్త్యుని చూచినప్పటి నుంచీ లోపాముద్రకు చిత్రమైన అనుభూతి కలిగింది. ఈ మహర్షిని గూర్చి తన స్నేహితురాళ్ళు ఎన్నిసార్లో ముచ్చటించగా వింది. ఈ మహర్షి తపఃప్రభావమే తన శరీరంగా రూపొంది, ప్రాణం నింపు కుందని పసిబిడ్డగా ఉన్నప్పట్నుంచీ ఇంట్లో తల్లిదండ్రు లనగా వింది తను. తనకు తెలియకుండానే బాల్యం నుంచీ అగస్త్యునిపైనే మనసు లగ్నం చేసు కుంది. అందుకే మహర్షిని చూడగానే తన మనసు పరవశించింది - 'ఆ మునినే వివాహం చేసుకుని, అతని ధర్మపత్నిగా జన్మ ధన్యం చేసుకుంటాను.' లోపా ముద్ర మనసు అగస్త్యుని ప్రేమైకమూర్తిగా గుర్తించింది.

తల్లిదండ్రుల ఆవేదన తగ్గించి, వారికి ఊరట కలిగించాలని నిశ్చ యించుకుంది లోపాముద్ర.

"మహర్షిని వివాహమాడటం నాకు త్రికరణశుద్ధిగా సమ్మతమే!" లోపా ముద్ర చేతులు జోడించింది.

కుమార్తె నిర్ణయానికి తల్లితండ్రులు అవాక్కయి పోయారు. మహర్షి అగస్త్యుని కళ్ళలో ఆనందం తొణికిసలాడింది.

మహర్షికి, తమ కుమార్తెకి అభిమతమైన నిర్ణయాన్ని, కాదనగల శక్తి వారి కికలేదు.

అమిత భక్తి శ్రద్ధలతో మహర్షికి నమస్కరించారు. దివ్యాంబరాభరణాలు వదలి నార చీర ధరించింది లోపాముద్ర. అగస్త్య మహర్షి వెంట అతని ధర్మ పత్ని అయి గంగాతీర ప్రాంతానికి తరలి వెళుతుంటే, చెమర్చిన కళ్ళొత్తు కున్నారు రాజదంపతులు.

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం: అరణ్యపర్వం : ద్వితీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక : 24-2-1988)